క్లుప్తంగా

అభినందన



ఏటూరునాగారం : ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, ఉపన్యాస పోటీలను ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ పోటీల్లో రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లాస్థాయి బహుమతి వచ్చినట్లు ఎంఈఓ మల్లయ్య తెలిపారు. కాగా అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుష్మకు రాతపరీక్షలో తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా గైడ్ టీచర్ కోడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడిని చూపుతున్న పోలీసులు

వాజేడు: గుడుంబాను విక్రయిస్తున్న కన్నెబోయిన కాటం రాజును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎస్ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రేగులపాడు, చెరుకూరు గ్రామాల్లో పోలీసులు మంగళవారం తనిఖీలను నిర్వహించారు. ఆ సమయంలో కన్నెబోయిన కాటం రాజు అక్రమంగా సుమారు 200 లీటర్ల గుడుంబాను క్యారీ బ్యాగుల్లో ఉంచి విక్రయిస్తున్నాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని సారాను, అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై లతీఫ్, హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్, తిరుపతి కానిస్టేబుళ్లు నాగార్జున, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, హోంగార్డులు నర్సయ్య, గోవింద్ ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మొగుళ్లపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి పోలీసులు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన కాసుబోజుల వీరచారి ఈ నెల 12న సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి ఎస్సై అశోక్ మంగళవారం అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండల పరిధి చింతకాని క్రాస్ సమీపంలోని వాగు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ధన్వాడ గ్రామానికి చెందిన తుల్సెగారి తిరుపతి, సమ్మయ్య, రాజయ్య ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి నుంచి కాటారం వైపుగా వస్తున్నారు. ఇదే క్రమంలో కాటారం వైపుగా వస్తున్న ఇసుక లారీ బైక్‌ను వెనక నుంచి ఢీ కొనడంతో ముగ్గురు కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఆశ్రమ పాఠశాలకు వెళ్లేదెలా?

- డ్రెయినేజీ నిర్మాణానికి తవ్విన కందకం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఆశ్రమ పాఠశాల ఎదుట సైడ్ కాల్వ కోసం తవ్విన కందకం

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట సైడ్ కాల్వ నిర్మాణం కోసం కందకాలు తవ్వారు. పని ప్రారంభించి పది రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు కాల్వ స్లాబ్ నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులకు దారి లేకుండా పోయింది. ఆశ్రమ పాఠశాలకు వంట సరుకులు తీసుకువచ్చే డీసీసీ వాహనాల్లోని సరుకులను కూడా పాఠశాలలో దిగుమతి చేసేందుకు కూలీల ద్వారా బయటి నుంచి మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆశ్రమ పాఠశాలకు అధికారులు వచ్చే పోయేందుకు తవ్వి వదిలేసిన కాల్వను చూసి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం సంబంధిత కాంట్రాక్టర్‌కు కందకాలు తవ్వి త్వరగా కాల్వ స్లాబ్ వేయ్యకపోతే ఇబ్బందులు తలెత్తుతాయనే ఆలోచన లేకపోగా కాల్వ పనులు ప్రారంభించి పది రోజులు గడుస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కష్టాలు ఎదురవుతున్నాయి. సంక్రాంతి పండుగకు ప్రభుత్వం పదిరోజు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సెలవుల సమయంలో సైడ్ కాల్వ పూర్తి చేయాల్సి ఉండగా పాఠశాల పునఃప్రారంభం తరువాత కందకాలు తవ్వడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

యువత మత్తుకు బానిస కావొద్దు

- పట్టుబడిన గంజాయి దహనం
- ఎస్పీ డాక్టర్ శబరీష్



ములుగు : గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ డాక్టర్ శబరీష్, పోలీస్ సిబ్బంది

ములుగు : జిల్లావ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడిన దాదాపు 80 కేజీల గంజాయిని మంగళవారం దహనం చేసినట్లు ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా పోలీస్ స్టేషన్‌లో నిల్వచేసిన గంజాయిని ఎస్పీ సమక్షంలో దహనం చేయడానికి హనుమకొండలోని సుబేదారిలో గల కాకతీయ మెడికల్ సర్వీసెస్ సెంటర్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయికి బానిస కావొద్దని, అమూల్యమైన జీవితాన్ని అంధకారంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సురక్షిత, ఆరోగ్యకరమైన జీవితానికి యువత యాంటీడ్రగ్ వారియర్‌గా పనిచేయాలని పేర్కొన్నారు. డ్రగ్స్ ఉపయోగం, సరఫరా చేస్తున్నట్లుగా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, వారికి నగదు పారితోషికం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ కిశోర్‌కుమార్, సీసీఎస్ సీఐ రమేష్, ఎస్ఎస్ తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, డీసీఆర్బీ ఎస్సై జగదీశ్, ఎస్సైలు లక్ష్మారెడ్డి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగరావుకు సన్మానం

హోంగార్డు నర్సింగరావు పోలీస్ శాఖలో అంకిత భావంతో సేవలందించారని ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. మంగళవారం నర్సింగరావు పదవీ విరమణ పొందగా పూలమాలతో పాటు శాలువా కప్పి సన్మానించారు. ఆయన పనితీరును ప్రశంసించారు. విధి నిర్వహణలో సహకరించిన ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎన్ రవిందర్, ఆర్ఐ తిరుపతి, అధికారులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట : యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండల పరిధిలోని పస్రా గోవిందరావుపేట గ్రామాల్లోని బస్టాండు, చౌరస్తా, కిరాణం షాప్, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా నార్కోటిక్ స్నైపర్ డాగ్‌తో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ డాగ్ హత్యలు, దోపిడీల చిక్కుముడులను విప్పడం, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టి పట్టించడం జరుగుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలుపాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా గ్రామసభలు

మంగపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికకు మొదటి రోజు నిర్వహించిన గ్రామ సభలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంపీడీఓ బానోత్ భద్రు తెలిపారు. మండలంలోని చుంచుపల్లి, కొత్తూరుమొట్లగూడెం, నర్సాయిగూడెం, బాలన్నగూడెం, దోమెడ, బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన గ్రామసభలలో సర్వే వివరాల జాబితాను రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ అధికారులు చదివి వినిపించారు. ఆయా గ్రామసభల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. అర్హత ఉండి సర్వే జాబితాలో పేర్లు రాని లబ్ధిదారుల నుంచి దరఖాస్తు స్వీకరించేందుకు ప్రత్యేక ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. మండలంలోని ఆరు గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో రేషన్ కార్డుల-321, ఇందిరమ్మ ఇళ్లు- 290, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం-109 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ భద్రు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తోట రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఏఓ చేరాలు, ఎంపీఓ మమత, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీఓ అంకూస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



మాట్లాడుతున్న చక్రవర్తి

ఏటూరునాగారం : అర్హులైన ప్రతీ పేదవారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందజేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలైన ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ఏడాది గడిచిన ఇప్పటివరకు ఏ ఒక్కటి కూడా అమలు చేయలేకపోతున్నారన్నారు. ఇప్పుడు గ్రామ సభల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. గ్రామసభల ద్వారా అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులను ప్రతి ఒక్కరికి ఇవ్వాలి డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నేటి మోదీ ఆవాస్ యోజన కింద కేంద్రం వాటా ఉందని,ప్రజా పాలన అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు వైపు కాకుండా ప్రజల వైపు చూడాలన్నారు. వావిలాల జనార్దన్, పడిదెల శ్రీనివాస్, జనగాం హరీష్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



పస్రా గ్రామపంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న సుందరయ్య నగర్ వాసులు

- సీపీఎం మండల కార్యదర్శి మల్లారెడ్డి

గోవిందరావుపేట : సుందరయ్య నగర్ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఇంటి స్థలాల మంజూరుకు గ్రామపంచాయతీలో నమోదు చేసి ఇంటినంబర్ ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సుందరయ్య నగర్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలంటూ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. మూడేళ్లుగా నిరుపేదలు సుందరయ్య నగర్‌లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వివరించారు. చట్టం ప్రకారం ప్రభుత్వ భూమిలో పేదలు నివాసం ఉంటే ఏడాదిలోగా ఇంటి నంబర్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కానీ నేటివరకు పంచాయతీ అధికారులు ఇంటినంబర్ ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు ఇంటి నంబర్ ఇచ్చి సుందరయ్య నగర్ కాలనీకి తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాదిళ్ల చిట్టిబాబు, గొంది రాజేష్, తీగల ఆదిరెడ్డి, గ్రామ కార్యదర్శి కడారి నాగరాజు, మండల కమిటీ సభ్యులు అంబాల మురళి, ముమ్మడి ఉపేంద్రచారి, క్యాతం సూర్యనారాయణ, సప్పిడి ఆదిరెడ్డి, జిట్టబోయిన రమేష్, మంచాల కవిత, రాజేశ్వరీ, రాజు, రాంబాబు, రామకృష్ణ, శారద, సువర్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాపర్‌వైరు చోరీకి యత్నం

గణపురం: మండలంలోని ఓసీ-3 ప్రాజెక్టులో డంపింగ్ యార్డు వద్ద కాపర్ వైర్ చోరీకి పాల్పడుతున్న ఒక వ్యక్తిని సింగరేణి సెక్యూరిటీ గార్డులు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. మణుగూరుకు చెందిన లారీ డ్రైవర్ కనకయ్య మంగళవారం తెల్లవారు జామున కాపర్ వైర్‌ను దొంగలించే ప్రయత్నంలో సింగరేణి సెక్యూరిటీ విభాగం గుర్తించి పోలీసులకు అప్పగించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

స్వాప్ బదిలీల జీఓ విడుదలకు కృషి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సురేందర్



మాట్లాడుతున్న కొయ్యడ సురేందర్

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులైన భార్యభర్తలను ఒకే దగ్గర విధులు నిర్వర్తించే విధంగా స్వాప్ జీఓ విడుదల చేసేందుకు పీఆర్‌టీయూ ఎనలేని కృషి చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు మనోవేదనతో గత మూడేళ్ల నుంచి బాధపడుతున్నారన్నారు. స్వాప్ జీఓ విడుదల కావడానికి టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఎనలేని కృషి ఉందన్నారు. స్వాప్ బదిలీల ఉత్తర్వులు జారీ కావడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లువెత్తిందని అన్నారు. భార్యభర్తలు ఇప్పుడు ఒకే దగ్గర విధులు నిర్వర్తించే అవకాశం లభించిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోరిక రామన్ననాయక్, రౌతు రాజు, చెన్నూరి కిరణ్, పల్ల నటరాజ్, తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై

ఎస్ఎస్‌తాడ్వాయి: వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మండలంలోని కాటాపూర్, దామెరవాయి, పంబపూర్, గంగారం గ్రామాల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని చాలా బాధాకరమన్నారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మండల కేంద్రంలోని కాటాపూర్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాదారులకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేశారు.

26నుంచి సంక్షేమ పథకాల అమలు

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ధనసరి సూర్య



మాట్లాడుతున్న ధనసరి సూర్య

ములుగు: ఈ నెల 26 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్‌కార్డుల జారీ వంటి నాలుగు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ధనసరి సూర్య అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలపై అనుమానాలు ఉంటే గ్రామ సభల్లో నివృత్తి చేసుకోవాలని అన్నారు. రేషన్ కార్డులు రాలేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క అర్హులందరికీ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నేపాల్‌రావు, కోశాధికారి అన్వేష్, మాజీ ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, రాజు, శ్రావణ్, భిక్షపతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

ఎస్ఎస్‌తాడ్వాయి : ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హులైన లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలకు పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులతోపాటు నాయకులు కార్యకర్తలు అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కల్పించాన్నారు. గ్రామసభలకు హాజరైన అధికారులకు ప్రజలందరూ సహకరించాలని , ఏమైనా తప్పిదాలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు నిరంతరం దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈసమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్ , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్, మేడారం జాతర చైర్మన్ అరేం లచ్చుపటేల్ , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి , తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్స సునీల్ దొర , డైరెక్టర్ రంగరబోయిన జగన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్ , మండల నాయకులు ఆలేటి జైపాల్ రెడ్డి , బండారి చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని వేద వ్యాస ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి సహచార విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల కరస్పాండెంట్‌గా పత్తి సిరిచందన, ఎంఈఓగా మనోహర్, పీఈటీలుగా నవీన్, కార్తీక్, రాంచరణ్, ఉపాధ్యాయులుగా పులి శ్రావ్య, షణ్ముఖశ్రీ, బిందు, పవన్, యువశ్రీ, రాంచరణ్‌రెడ్డి, వంశీ, హర్షితలు వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు వీరమల్లు, డైరెక్టర్లు సూర్యప్రకాశ్‌రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు



వెంకటాపురం(ఎం): ఎల్లారెడ్డిపల్లె సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ గిరిబాబు



వెంకటాపురం(కె): మరికాల పంచాయతీలో..



ఏటూరునాగారం: ఆందోళనకారులను వారిస్తున్న ఏఎస్సై సుబ్బారావు

సాక్షి నెట్‌వర్క్ : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీ, డీపీఓ దేవరాజు అన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఆయా గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరు నిరంతరం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పథకాలు రాలేదని అర్హత కలిగిన వారు నిరుత్సాహ పడొద్దన్నారు. లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రజాపాలన గ్రామ సభలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆయా గ్రామసభల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: సభలో దరఖాస్తుల స్వీకరణ..



ఏటూరునాగారం: గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, పక్కన అధికారులు



వాజేడు: టేకులగూడెంలో..



వెంకటాపురం(ఎం): నర్సింగాపూర్‌లో..



ఎస్ఎస్‌తాడ్వాయి: మాట్లాడుతున్న దేవరాజు



వాజేడులో..

ఆదర్శనగర్ కాలనీలో శ్రమదానం

కాటారం: మండలంలోని ఆదర్శనగర్ కాలనీలో మంగళవారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాలనీ కమిటీ, కాలనీవాసులు శ్రమదానం చేశారు. కాలనీ రహదారుల వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలిగించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కన్వీనర్ ఆత్మకూరి కుమార్‌యాదవ్, మహేశ్, గడ్డం కొంరయ్య, రాంనారాయణ, పాల్గొన్నారు.